ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఈ నెలాఖరుకు ధాన్యం సేకరణ పూర్తి: జేసీ

కొమరాడ, జనవరి 4: జిల్లాలో ధాన్యం సేకరణ ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. గురువారం కోటిపాం గ్రామంలో ఉన్న రైస్ మిల్లును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు ఉండరా దని స్పష్టం చేశారు. విధిగా నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం గుమడ గ్రామంలో పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులు పంపిణీని పరిశీలించారు.

అందరికీ అండగా టీడీపీ

- నారా భువనేశ్వరి వెల్లడి
- జిల్లాలో పర్యటన విజయవంతం
- అడుగడుగునా ప్రజల నీరాజనం
- బాధిత కుటుంబానికి పరామర్శ
- ఆర్థిక సాయం అందజేత



ప్రజలకు అభివాదం చేస్తున్న భువనేశ్వరి



బిల్లుమడకు తరలివచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలు

పార్వతీపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి)/ పాలకొండ/భామిని: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పర్యటనకు విశేష స్పందన లభించింది. 'నిజం గెలివాలి' పాదయాత్రలో భాగంగా తొలిసారి జిల్లాకు వచ్చిన ఆమెకు టీడీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. గురువారం ఆమె పాలకొండలోని కోటదుర్గ గుడి నుంచి సీతంపేట, కొత్తూరు మండలాల మీదుగా భామిని మండలం బిల్లుమడ గ్రామానికి చేరుకున్నారు. ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్‌కు కలత చెంది ఆ గ్రామవాసి బర్రి విశ్వనాథం మరణించారు. ఈ మేరకు విశ్వనాథం భార్య వనజాక్షి, పిల్లలు గౌతమ్, శివశంకర్‌లను భువనేశ్వరి ఓదార్చారు. విశ్వనాథం టీడీపీ వీరాభిమాని అని వనజాక్షి కన్నీరు పెట్టుకొని చెప్పారు. ఆమెను భువనేశ్వరి ఓదార్చుతూ కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రూ.మూడు లక్షల చెక్కును వనజాక్షికి అందించారు.



బాధిత కుటుంబంతో మాట్లాడుతూ..



బిల్లుమడలో..



భువనేశ్వరి రాక కోసం ఎదురుచూస్తున్న మహిళలు



అంగన్‌వాడీల నుంచి వినతులు స్వీకరిస్తూ..

ఘన స్వాగతం..

పాలకొండలో నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మంది నారా భువనేశ్వరికి స్వాగతం పలికారు. ముందుగా ఆమె కోటదుర్గతల్లి ఆలయానికి చేరుకొని అక్కడ నుంచి భామిని బయల్దేరి వెళ్లారు. పాలకొండ నుంచి అడుగుడుగునా మహిళలు భువనేశ్వరికి ఘన స్వాగతం పలికారు. సీతంపేటలో పార్టీ మండల అధ్యక్షుడు సవర తోట ముఖలింగం ఆధ్వర్యంలో సుమారు 1500 మంది గిరిజనులు నారా భువనేశ్వరికి ఆహ్వానం పలుకుతూ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా వారు అటవీ ఉత్పత్తులను భువనేశ్వరికి కానుకగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె గిరిజనులతో మమేకమయ్యారు. టీడీపీ అండగా ఉంటుందని చెబుతూ.. ప్రతి ఒక్కర్నీ అభినందిస్తూ ముందుకుసాగారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తామని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని గిరిజనులు నినాదాలు చేశారు. శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఆధ్వర్యంలో భువనేశ్వరికి స్వాగతం పలికారు. పాలకొండ నియోజకవర్గ పరిశీలకుడు కలమట సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పసుపుమయమైన బిల్లుమడ..

భామిని మండలం బిల్లుమడ గురువారం పసుపుమయమైంది. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆ గ్రామం కిటకిటలాడింది. పాలకొండ నియోజకవర్గ పరిధిలో ఉన్న భామిని, సీతంపేట, పాలకొండ, వీరఘట్టం మండలాల నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చాయి. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా భారీగా హాజరయ్యారు. 'చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి.. జై తెలుగుదేశం' అంటూ వారంతా నినాదాలు చేశారు. ప్రజలకు నారా భువనేశ్వరి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు కళా వెంకటరావు, గుమ్మిడి సంధ్యారాణి, తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, ఎమ్మెల్సీ అనూరాధ, పాలకొండ, కురుపాం నియోజకవర్గాల ఇన్‌చార్జిలు నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



రోప్ పార్టీగా ఏర్పడిన 'నిజం గెలవాలి' వలంటీర్లు

రక్షణ దళంగా నిలిచి..

'నిజం గెలవాలి' పాదయాత్రలో భాగంగా నారా భువనేశ్వరి తొలుత పాలకొండలో కోట దుర్గమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. పెద్ద ఎత్తున టీడీపీ, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు చేరుకోవడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. అక్కడ పోలీసులు అంతంత మాత్రంగానే కనిపించారు. అయితే 'నిజం గెలవాలి' వలంటీర్లు రోప్ పార్టీగా ఏర్పడి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చూశారు. భువనేశ్వరికి రక్షణ దళంగా నిలిచారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకున్నారు. జిల్లాలో నారా భువనేశ్వరి పర్యటనను పార్టీ శ్రేణులు విజయవంతం చేశాయి.

శ్రేణుల్లో నూతనోత్సాహం..

సీతంపేట: 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి సీతంపేటను సందర్శించగా, ప్రజల ఆదరణ, స్పందన చూసిన కార్యకర్తలు, నేతల్లో నూతనోత్సాహం నెలకొంది. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేస్తామని వారు చెప్పారు. నాడు పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా లోకేష్ సీతంపేట సందర్శించి.. మన్యంలో రహదారుల అభివృద్ధి, టూరిజం వంటి వాటికి అధిక ప్రాధాన్యం కల్పించారని కార్యకర్తలు భువనేశ్వరి దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు పవన్‌కుమార్, బిడ్డిక దమయంతినాయుడు, సవర మాలయ్య ఆరిక లక్షుమయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

- పారిశుధ్య కార్మికుల డిమాండ్

పార్వతీపురం టౌన్/ పాలకొండ/ సాలూరు రూరల్, జనవరి 4: గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం జగన్ నెరవేర్చి.. తమకు న్యాయం చేయాలని పారిశుధ్య కార్మికులు నినదించారు. ఈ మేరకు గురువారం పార్వతీపురంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పట్టణంలోని పలు వీధుల్లో డప్పు కొట్టి వినూత్నంగా నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకుంటే మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పాలకొండ నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో పారిశుధ్య కార్మికులు చేతికి తాళ్లు కట్టుకుని నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రభుత్వం రెచ్చగొట్టే విధానాన్ని విడనాడాలని సాలూరులో మున్సిపల్ కార్మికులు భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



పార్వతీపురంలో డప్పు కొడుతూ కార్మికుల నిరసన



సాలూరులో భిక్షాటన చేస్తూ ర్యాలీగా వెళ్తున్న కార్మికులు



పాలకొండలో చేతికి తాళ్లు కట్టుకుని..

వదలవు.. కదలవు!

- కొమరాడ, భామినిలో గజరాజుల సంచారం

కొమరాడ/భామిని, జనవరి 4: కొమరాడ మండలం కుమ్మరిగుంట రహదారిపై గురువారం ఏడు గజరాజులు హల్‌చల్ చేశాయి. దీంతో ఆ దారిలో ప్రయాణించే వారు, ప్రజలు, వాహనదారులు బెంబేలెత్తిపోయారు. అవి ఎవరిపై దాడి చేస్తాయోనని ఆందోళన చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది అక్కడకు వచ్చి సమీప ప్రాంతంలో ఉన్న పంట పొలాల్లోకి ఏనుగుల గుంపును తరలించారు. దీంతో ఆ రహదారి గుండా ప్రయాణాలు యథావిధిగా సాగాయి. ఇక భామినిలో సంచరిస్తున్న ఏనుగులు నల్లరాయిగూడ సమీపానికి చేరుకొని చెరకు తోటల్లో తిష్ఠవేశాయి. సాయంత్రం ఆరుబయట సంచరించాయి. ఏనుగుల వల్ల పంటలను నష్టపోయామని, తమను ఆదుకోవాలని సొలికిరి గ్రామానికి చెందిన రైతులు కోరుతున్నారు.



కుమ్మరిగుంట ప్రధాన రహదారిపై సంచరిస్తున్న ఏనుగుల గుంపు

సర్కారుకు వ్యతిరేకంగా ఆలపించి..

- ఎస్ఎస్ఏ ఉద్యోగుల ఆందోళన

బెలగాం, జనవరి 4: పార్వతీపురం కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు గురువారం వినూత్నంగా నిరసన తెలిపారు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గేయాలు ఆలపించారు. సీఎం జగన్ మొండి వైఖరి వీడి.. తమ సమస్యలు పరిష్కరించాలని నినదించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా.. నోటీసులతో బెదిరింపు చర్యలకు పాల్పడడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. సర్కారు స్పందించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మరోవైపు కొందరు ఎస్ఎస్ఏ ఉద్యోగులు 'చలో విజయవాడ'కు తరలివెళ్లారు. 5న ఎస్పీడీ కార్యాలయం ముట్టడికి రాష్ట్ర నాయకులు పిలుపునివ్వడంతో వారంతా పార్వతీపురం నుంచి బయల్దేరి వెళ్లారు.



నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

మాతృ మరణాలు నివారించాలి

- డీఎంహెచ్‌వో జగన్నాథరావు

బెలగాం, జనవరి 4: జిల్లాలో మాతృ మరణాలు నివారించాలని డీఎంహెచ్‌వో బి.జగన్నాథరావు వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం పార్వతీపురంలోని ఎన్జీవో భవనంలో జిల్లాస్థాయి ఇంటిగ్రేటెడ్ హైరిస్క్ ప్రెగ్నెన్సీ మేనేజ్మెంట్ అండ్ ట్రాకింగ్ ప్రోగ్రాం మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులకు విధిగా వైద్య పరీక్షలు నిర్వహించి ప్రమాదకర పరిస్థితులు గుర్తించాలన్నారు. వారిని ఆసుపత్రులకు తరలించి తగిన వైద్యం అందించాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఈ శిక్షణ ద్వారా తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రుల వైద్యాధికారులు, గైనకాలజిస్టులు పాల్గొన్నారు.

అదరం.. బెదరం

- సర్కారు బెదిరింపులకు భయపడం
- నినదించిన అంగన్‌వాడీలు
- జిల్లావ్యాప్తంగా నిరసనలు



పాలకొండ: మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



సాలూరులో ఒంటికాలిపై నిలబడి దండం పెడుతూ నిరసన తెలియజేస్తున్న దృశ్యం



పార్వతీపురంలో..

బెలగాం/ పాలకొండ/ సాలూరు రూరల్/ సీతానగరం/ కురుపాం/ కొమరాడ, జనవరి 4: వైసీపీ ప్రభుత్వ నోటీసులకు భయపడేది లేదని, తమ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. గురు వారం జిల్లావ్యాప్తంగా వారు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గత 24 రోజులుగా శాంతియుతంగా ఆందోళనలు చేపడుతున్నా సీఎం జగన్ స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ మేరకు సర్కారుకు తీరును ఖండిస్తూ.. పార్వతీపురం కలెక్టరేట్ శిబిరం వద్ద అంగన్ వాడీలు నిరసన తెలిపారు. ఈ నెల 5న విధుల్లో చేరకుంటే చర్యలు తీసుకుంటామని సర్కారు బెదిరించడం తగదన్నారు. చర్చల పేరిట కాలయాపన చేస్తూ.. చిరుద్యోగులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమ్మె విర మించాలని ఆదేశాలివ్వడం దుర్మార్గమైన చర్య అని తెలిపారు. గతంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, లేకుంటే సమ్మె మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. వారికి సీఐటీయూ నాయ కులు సంఘీభావం తెలిపారు. పాలకొండతహసీల్దార్ కార్యాలయం ఎదుట, సీతానగరం, కురుపాంలో అంగన్‌వాడీలు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. 'జగనన్నా నీకో దండం.. మా డిమాండ్లు నెరవేర్చు' అంటూ సాలూరులో ఒంటి కాలిపై నిలబడి.. దండం పెడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన ప్రదర్శన చేపట్టారు. కొమరాడలోని అంతర్రాష్ట్ర రహదారిపై వెళ్తున్న పలు వాహనాలను ఆపి శుభ్రం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.



కురుపాంలో..



కొమరాడ అంతర్రాష్ట్ర రహదారిలో కారును శుభ్రం చేస్తూ...



సీతానగరంలో...

పోరాటానికి నిధులు

● సమకూర్చిన ఉపాధ్యాయులు

కొత్తవలస: సమ్మె చేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల పోరాటానికి మండలంలోని ఉపాధ్యాయులు సంఘీభావం తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన 106 మంది ఉపాధ్యాయులు 32 వేల రూపాయలను, యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షురాలు 2 వేల రూపాయలను సేకరించారు. ఈ నిధులలో 30 వేల రూపాయలను సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు తమ పోరాటానికి వినియోగించుకోవాలని సూచిస్తూ సమ్మె చేస్తున్న వారికి అందజేశారు. గత 22 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు 4 వేల రూపాయలను అందచేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జి.వెంకట నాయుడు, సీహెచ్ నిర్మలాదేవి, జి.విజయగౌరి, గాడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పోస్టల్ బీమా

జామి: మండలంలోని అలమండ గ్రామానికి చెందిన అయినంపూడి సత్యనారాయణరాజు కొద్దికాలం క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఇతని భార్య కుమారికి పోస్టల్ బీమా పాలసీలో భాగంగా రూ.పదిలక్షల ప్రమాదబీమాను గురువారం అలమండ పోస్టాఫీస్‌లో జిల్లా పోస్టల్ అధికారి ఎన్‌వీఎస్ఎన్ రాజు, ఏఎస్పీ సుందర్‌నాయుడు అందజేశారు. ప్రతి ఒక్కరూ పోస్టల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గాలికుంటు వ్యాధిపై అవగాహన

లక్కవరపుకోట: పశువుల్లో తరచుగా వస్తున్న గాలికుంటు వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల కేంద్ర పశువైద్యులు కే.గాయత్రి తెలిపారు. గురువారం కల్లెంపూడి గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. గాలికుంటు వ్యాధి సోకకుండా ముందుగా పశువులకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులకు బహుమతులు

శృంగవరపుకోట: పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణం చేసేవారికి శృంగవరపుకోట ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్ గిఫ్ట్ స్కీమ్ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. జామి, తాటిపూడి, కొట్యాడ రూట్లలో విజయనగరం తిరిగే బస్సుతో పాటు గుమ్మకోట తిరిగే బస్సు ప్రయాణికులకు డ్రా తీసిన అధికారులు గురువారం శ్రీదేవి, సురేష్, ఎం.సూర్యనారాయణ, పుష్పలకు ఈ బహుమతులు అందించారు.

నేడు 'బాబు ష్యూరిటీ..'

విజయనగరం రూరల్: విజయనగరం ఆరో డివిజన్‌లో శుక్రవారం 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు జమ్ములోని అంజనేయస్వామి ఆలయం వద్ద ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయనగర నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజుతో పాటు, నగర నాయకులు పాల్గొంటారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

శృంగవరపుకోట: స్థానిక శ్రీనివాస కాలనీలో గురువారం అయోధ్య బాల శ్రీరాముని స్పర్శతో తయారు చేసిన అక్షింతలు పంపిణీ చేశారు. ఈనెల 22న ప్రారంభం కానున్న ఆలయ ప్రారంభోత్సవానికి రావాలని బీజేపీ నాయకుడు డి.సూర్యారావు ఆహ్వాన పత్రికలు, ప్రసాదం అందించారు. డాక్టర్ పి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండల కేంద్రంలోని పురవీధుల్లో అయోధ్య నుంచి తీసుకువచ్చిన రాములవారి అక్షింతలను పంతులు వేదమంత్రాలతో పంచిపెట్టారు. పురవీధుల్లో రాములవారి విగ్రహాలను ఊరేగిస్తూ వీటిని అందరికి అందించారు. గుణుపూరు శ్రీనివాసరావు, అంబటి గణపతి, జక్కు సోమేశ్వరరావుతోపాటు పలువురు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు చేయూత

విజయనగరం దాసన్నపేట: తమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు చేయూత అందిస్తానని చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరి సహస్ర అన్నారు. గురువారం కోట జంక్షన్‌లోని బొగ్గులదిబ్బలో కూరగాయల వ్యాపారుల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తోట వాసు, జాకీరు హుస్సేన్, రామకృష్ణ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

వంగర: ప్రజా సంక్షేమమే వైసీపీ ధ్యేయమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. వంగరలో గురువారం వైఎస్ఆర్ పింఛను కానుక పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు తలే రాజేష్‌కు సీఎం జగన్ అప్పజెప్పారని.. కష్టకాలంలో మీకు తోడుగా ఆయన ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎంపీపీ సురేష్, వైస్ ఎంపీపీ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గాలి కుంటు వ్యాధి నివారణకు వ్యాక్సిన్

బొబ్బిలి: బొబ్బిలి, రామభద్రపురం మండలాల్లో అన్ని రకాల పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎల్. విష్ణు తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెలాఖరు వరకు ఈ కార్యక్రమాన్ని పశువైద్య కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం 7 నుంచి 9 గంటల లోపు మాత్రమే ఈ టీకాలు వేయించాలని ఆయన సూచించారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పతకం

బొబ్బిలి: ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో గత నెల 22 నుంచి 26 వరకు జరిగిన 67 వ జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో ఆంధ్ర ప్రదేశ్ జట్టు మూడో స్థానంలో నిలిచింది. ఆ జట్టులో బొబ్బిలి ప్రభుత్వ గురుకుల పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి కె.సందీప్ ఉన్నాడు. సందీప్‌ను స్థానిక గురుకుల ప్రిన్సిపాల్ కె.రఘునాథ్, పీఈటీ వెంకటరమణ, ఇతర ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు యూనిఫారాలు

శృంగవరపుకోట: స్థానిక మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు గురువారం స్నేహ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఏఎస్ వెంకటరావు, మంథా సుబ్బారావు, బుగత వెంకటేశ్వరరావు యూనిఫారాలు పంపిణీ చేశారు. రూ.45 వేల విలువ చేసే వీటిని కార్మికులందరికీ అందించారు. వ్యాయామ అధ్యాపకుడు శ్రీరాములు పాల్గొన్నారు.

పట్టాలిస్తేనే పాకలు తొలగిస్తాం

శృంగవరపుకోట: ఇళ్ల స్థలాళ పట్టాలు ఇస్తేనే పాకలను తొలగిస్తామని స్థానిక చెరకు కాటా స్థలానికి ఆనుకొని గెడ్డను ఆక్రమించిన వారు తహసీల్దార్ డి.శ్రీనివాసరావుకు తేల్చి చెప్పారు. గురువారం కార్యాలయానికి వచ్చిన డిప్యూటీ కలెక్టర్ సుదర్శన్ దొర ఎదుట పాకల తొలగింపుపై చర్చించారు. 90 రోజుల స్కీంలో ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గెడ్డ స్థలంలో వేసిన పాకలను రెండు రోజుల్లో తొలగిస్తామని తహసీల్దార్ చెప్పారు.

చిన్నారులతో ఆడుతూ పాడుతూ..

రాజాం: బొద్దాం అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న చిన్నారులతో ఎంపీడీవో బాసూరు శంకరరావు గురువారం ఆడుతూ పాడుతూ గడిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉండటంతో సచివాలయ సిబ్బందితో తాళాలు తీయించి... చిన్నారులను కేంద్రానికి పిలిపించి వారితో కాలక్షేపం చేశారు. భోజనాలు ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ కేంద్రాన్ని తెరవాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆంధ్రులంతా చంద్రన్న పాలన కోరుకుంటున్నారు

● బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ● ప్రభుత్వ వైఫల్యాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం



ఎస్.కోటలో మేనిఫెస్టోను పంపిణీ చేస్తున్న గొంప కృష్ణ



ఎస్.కోట మండలంలో ప్రచారం చేస్తున్న కోళ్ల లలితకుమారి

శృంగవరపుకోట రూరల్, జనవరి 4: రాష్ట్రంలో ఉన్న ఐదుకోట్ల ఆంధ్రులు ఈ సైకో పాలనపై విసిగిపోయారని, వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించి చంద్రబాబునాయుడు పాలన కోరుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. గురువారం రాత్రి మండలంలోని తలారీ పంచాయతీ ఉసిరి గ్రామంలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లలితకుమారి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం సంక్షేమ పథకాలపేరుతో చేస్తున్న మోసాన్ని ప్రజలు గ్రహించారని, వచ్చే ఎన్నికల్లో అధికారపార్టీను ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న తదితరులు ఉన్నారు.

శృంగవరపుకోట: సీఎం జగన్‌ను ఇంటికి పంపించే రోజులు దగ్గర పడుతున్నాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. గురువారం శృంగవరపుకోట చినవేమలవీధి, గౌరిశంకర కాలనీల్లో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణి చేశారు. టీడీపీ మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ ప్రభుత్వం తీసుకుంటున్న వింత నిర్ణయాలు, అమలు చేస్తున్న పథకాల తీరుతో రాష్ట్రంలో ఎవరూ బతకలేని పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. విశాఖపార్లమెంటు ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు జుత్తాడ రామసత్యం, అడారి రమేష్, ఎం.మంగరాజు తదితరులు వున్నారు.

రైస్‌మిల్లులను తనిఖీ చేసిన ఆర్డీవో



బొబ్బిలిలో రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న ఆర్డీవో సాయిశ్రీ

బొబ్బిలి, జనవరి 4: బొబ్బిలి పట్టణంలో గొల్లపల్లి, మండలంలోని కోమటిపల్లి తదితర ప్రాంతాల్లో విజయగౌరి, మహాలక్ష్మి, విజయలక్ష్మి మోడరన్ రైస్ మిల్లులను గురువారం ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ తనిఖీ చేశారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎటువంటి జాప్యం లేకుండా వెంటనే అన్‌లోడ్ చేసి పంపించాలని ఆదేశించారు. మిల్లుల దగ్గర ధాన్యంతో వచ్చిన వాహనాలు భారీగా నిలిచిపోతున్నాయని వార్తలు వస్తుండడంతో ఆమె స్పందించి మిల్లులను పరిశీలించారు. మిల్లుల యజమానులు, రెవెన్యూ, ఆర్‌బీకేల సిబ్బందితో ఆమె మాట్లాడారు. క్షేత్రస్థాయిలో సాంకేతికంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. గొల్లపల్లిలో రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి అక్కడ ధాన్యం కొనుగోలు ప్రక్రియ తీరుపై ఆరా తీశారు. సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేశారు. ఆర్డీవో వెంట డీటీ రెడ్డి సాయికృష్ణ, ఇతర సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వండి

శృంగవరపుకోట, జనవరి 4: సంక్రాంతి పండగకైనా పంచాయితీ పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వాలని వార్డు సభ్యులు చిప్పాడ శేషగిరిరావు, అనకాపల్లి చెల్లియ్య సూచించారు. గురువారం శృంగవరపుకోట మేజర్ పంచాయితీ సర్వసభ్య సమావేశం సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి అధ్యక్షతన జరిగింది. ఆరు నెలలుగా జీతాలు చెల్లించలేదని, పలువురు కార్మికులు క్రిస్మస్ పండగ కు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పందిరప్పన్న కూడలి సమీపంలో గెడ్డను ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాలను ఎందుకు అడ్డుకోవడం లేదని సభ్యులు అధికారులను నిలదీశారు. జీ+2కు అనుమతులు తీసుకొని కొందరు అదనంగా నిర్మాణాలు చేపడుతున్నారని, మరికొందరు నిబంధనలను అతిక్రమించి నిర్మిస్తున్నా పంచాయితీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అలాంటి వారందరినీ గుర్తించి నోటీసులు ఇస్తామని కార్యనిర్వాహక అధికారి సీహెచ్ కన్నబాబు తెలిపారు. పంచాయితీలో ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూదేనని స్పష్టం చేశారు. ఇంటి పన్ను బకాయిలు రూ.1.64.07.535 ఉన్నాయన్నారు. ఉప సర్పంచ్ మోపాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై చర్చ

లక్కవరపుకోట: ధాన్యం కొనుగోలు సరిగా జరగలేదని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు మండిపడ్డారు. గురువారం ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రభుత్వ పనితీరు బాగోలేదని, కనీసం గోనె సంచులు కూడా ఇవ్వలేదని తామరాపల్లి, తలారి, మల్లివీడు సర్పంచ్‌లు మండిపడ్డారు. మిల్లర్లు రైతులతో ఆటలాడుతున్నారని, క్వింటాకు 5 నుంచి 7 కిలోలు ఎక్కువ తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యలు తీర్చలేదని, లైన్‌మెన్‌లు కనిపించడం లేదని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లచ్చంపేట, మార్లాపల్లి, తామరాపల్లి సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నికల వేళ ఇటువంటి ఇబ్బందులు రావడంపై నిరాశగా ఉందని అధికార పక్ష సభ్యులు ఎమ్మెల్యేతో చెప్పడం విశేషం. అనంతరం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ గడపగడపకూ వెళ్లినప్పుడు ఇళ్లు కావాలని చాలా మంది అడిగారని, అధికారుల నిర్లక్ష్యంతో చాలా మందికి పథకాలు అందలేదనే సమాచారం ఉందన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని పార్టీలకు అతీతంగా పథకాలన్నీ అందించాలని తెలిపారు. మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కబ్జాలు లేవంటే నవ్విపోతారు

● ఎమ్మెల్యే ప్రకటనపై సీపీఐ జిల్లా కార్యదర్శి ఎద్దేవా

బొబ్బిలి, జనవరి 4: బొబ్బిలి ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాల కబ్జాలే జరగలేదని ఎమ్మెల్యే ప్రకటించడం హాస్యాస్పదమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ఎద్దేవా చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ఇందిరమ్మ కాలనీలో మొత్తం కబ్జాల పర్వం, అక్రమ క్రయవిక్రయాలు జరుగుతున్నాయని ఆధారాలతో చూపించామన్నారు. అసలైన ఇళ్ల స్థలాల దొంగలు దర్జాగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టి లక్షలాది రూపాయలకు బహిరంగ మార్కెట్‌లో అమ్ముకున్నారన్నారు. ఆ కాలనీలో పేదలు కట్టుకున్న ఇళ్లకు, కబ్జాదారులు కట్టుకున్న ఇళ్లకు తేడా చాలా స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి వాటిని పరిశీలించాలని డిమాండ్ చేశారు. అక్రమ కట్టడాలన్నిటినీ జేసీబీతో తొలగిస్తామని గతంలో ప్రకటించిన ఎమ్మెల్యే ఇప్పుడేమో అక్రమాలు లేవని తేల్చి చెప్పడం ఎవరిని కాపాడేందుకు అని ఆయన ప్రశ్నించారు. మొత్తం లేఅవుట్‌లో 1,424 మంది మాత్రమే ఇళ్లు కట్టుకున్నారని, 479 మంది పునాదులు వేసి వదిలేశారన్నారు. ఇళ్ల స్థలాల అవినీతి కార్యకలాపాలను బయట పెట్టకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని రమణ తెలిపారు.

నిలిచిన తాగు నీటి సరఫరా

● కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మె ● రాజాం వాసులకు ఇబ్బందులు



డోలపేట రక్షిత పథకానికి తాళాలు వేసిన దృశ్యం, అధికారులను అడ్డుకుంటున్న కార్మికులు

రాజాం, జనవరి 4: పురపాలక సంఘ పరిధిలోని ప్రజలకు గురువారం నుంచి తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మెకు దిగడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కాంట్రాక్టు ఉద్యోగులు 42 మంది వరకు పని చేస్తున్నారు. రెగ్యులర్ చేయాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో గురువారం నుంచి సమ్మెకు దిగారు. అర్ధనగ్న ప్రదర్శన చేశారు. కమిషనర్ ఎంవీ నాగరాజు రెగ్యులర్ కార్మికులతో తాగునీరు అందించడానికి ప్రయత్నించగా మిగిలిన వారు అడ్డుకున్నారు. దీంతో సీఐ రవికుమార్‌కు కమిషనర్ ఫిర్యాదు చేయడమే కాకుండా అన్ని రక్షిత మంచినీటి పథకాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. పంప్ హౌస్ సిబ్బంది కూడా సమ్మెలో ఉండటంతో రేగిడి పంప్ హౌస్ దగ్గర రెగ్యులర్ వర్కర్లను ఉంచడానికి చర్యలు తీసుకున్నారు. అవసరమైతే సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బందిని రక్షిత పథకాల వద్ద ఉంచడానికి చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో పట్టణంలో గురువారం సరఫరా ఉండదు.

గురుదేవ సేవలు ఆదర్శం కావాలి

కొత్తవలస, జనవరి 4: గురుదేవ చారిటబుల్ ట్రస్టు సేవా కార్యక్రమాలు మరికొందరికి ఆదర్శం కావాలని వాల్తేరు రైల్వే డివిజినల్ మేనేజర్ సౌరభ్ ప్రసాద్ అన్నారు. గురువారం మంగళపాలెం గ్రామంలో గురుదేవ చారిటబుల్ ట్రస్టును ఆయన సందర్శించారు. దివ్యాంగులకు అందిస్తున్న కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని, ఉచిత వైద్య సేవలను అందిస్తున్న గురుదేవ ఆసుపత్రిని సందర్శించారు. ఆయన చేతుల మీదుగా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేశారు. ఈ సందర్భంగా సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ గురుదేవ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు మరి కొంతమంది ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నిస్వార్థంగా సేవలు అందించే సంస్థలకు ప్రతి ఒక్కరూ సహకారం అందిస్తారన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశాలను ఆయన పరిశీలించారు. భవిష్యత్తులో ట్రస్టు సేవలును మరింత విస్తృతం చేయాలన్నారు. ట్రస్టు చైర్మన్ రావర్తి జగదీష్ బాబు మాట్లాడుతూ ఇంత వరకు సుమారు లక్షా 25 వేల మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేశామన్నారు. వాటికి రిపేర్లు అవసరమైనా.. చేయిస్తున్నామని తెలిపారు తమ ఆసుపత్రి ద్వారా కార్పొరేట్ కంటే మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నట్టు తెలిపారు. విశాఖకు చెందిన గాయిత్రీ ఆసుపత్రితో అవగాహన ఉందన్నారు.

సిమెంట్ లెక్కలపై ఉన్నతాధికారులు సీరియస్

రేగిడి, జనవరి 4: మండలంలో సచివాలయాలు, ప్రభుత్వ భవనాల పనులకు మూడేళ్ల క్రితం పంపిణీ చేసిన 10వేల సిమెంట్ బస్తాల లెక్క తప్పిన విషయాన్ని పంచాయితీరాజ్ ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఈ మేరకు స్థానిక పీఆర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. వీటి రికవరీకిపై రాజాం డీఈఈ జైప్రకాశ్, ఏఈ రామకృష్ణలు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. రేగిడిలో 25 సచివాలయాలకు సరఫరా అయిన సిమెంట్ లెక్కలను ఆరా తీశారు. ఏ కాంట్రాక్టరు? ఏఏ నేతలు వాడుకొన్నారనే దానిపై సమగ్ర నివేదికలు తయారు చేయాలని ఆదేశించినట్లు డీఈఈ తెలిపారు. వివిధ సచివాలయాల్లో ప్రాథమికంగా 50 మంది వాడకందారులను గుర్తించినట్లు ఏఈ వెల్లడించారు. ఇంకా ఎన్ఆర్‌జీఈఎస్ పనులకు మళ్లించిన వారి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. వారికి నోటీసులు జారీ చేసి.. రికవరీకి ఉపక్రమిస్తున్నట్లు ఏఈ తెలిపారు. ఇంకా వాడకందారులు ముందుకు రాకపోతే తాను, డీఈఈలు వేర్వేరుగా నోటీలు జారీచేసి వారం పది రోజుల్లో వసూలుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు పీఆర్ ఏఈ తెలిపారు. ముందుగా మునకలవలస సచివాలయం నుంచి రికవరీకి చర్యలు చేపట్టారు. అక్కడ అదనంగా వెళ్లిన 250 సిమెంట్ బస్తాలను వారి బిల్లు నుంచి లక్ష్మీపురం(180బస్తాలు), చాటాయివలసకు(130) ఎఫ్‌టీపీ జనరేట్ చేసినట్లు వెల్లడించారు. అయితే రేగిడి, ఖండ్యాంలో పాడైన సిమెంట్ బస్తాలకు ఎవరు బాధ్యులు అన్నదానిపై సిబ్బంది మల్లగుల్లాలు పడుతున్నారు.

'ఆడుదాం ఆంధ్రా'కు స్పందన కరువు

రాజాం: శ్యాంపురం గ్రామంలో గురువారం 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం నిర్వహించారు. మహిళలతో ఖోఖో ఆడించారు. గ్రామంలో క్రీడాకారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఖోఖో మాత్రమే ఆడించారు. ఎంపీడీవో బాసూరు శంకరరావు, ఈవోపీఆర్డీ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో దీపాలంకరణ సేవ

బొబ్బిలి, జనవరి 4: ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా గురువారం సాయం త్రం కంచరవీధి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష దీపాలంకరణ సేవ కన్నుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, భక్తసంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణుని చిత్రాకారంలో, శంకు, చ క్రాకారాల్లో దీపాలు వెలిగించారు. భక్తులంతా సేవలందించారు. ఉదయం బేడా సేవ, పల్లకీ సేవ, పాశురాల సమర్పణ, విష్ణుసహ స్ర స్తో త్ర పారాయణాలు ఇతర పూజాది కార్య క్రమాలు ఘనంగా జరిగాయి.

జామి: మండలంలోని కుమరాంలో ఉన్న ఐశ్వర్య లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం రాత్రి సహస్ర దీపాలంకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ధనుర్మాసం సందర్భంగా నిర్వహించినట్లు తెలిపారు.





కుమరాం ఆలయంలో సహస్ర దీపారాధన

బొబ్బిలి కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ..

కవ్వింపు చర్యలు వద్దు

● ప్రభుత్వాన్ని హెచ్చరించిన మున్సిపల్ కార్మికులు

రాజాం రూరల్: హక్కుల సాధనకోసం సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వం కవ్వింపు చర్యలకు దిగితే ఫలితం తీవ్రంగా ఉంటుందని సీటు జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ హెచ్చరించారు. రాజాంలో మున్సిపల్ కార్మికులు గురువారం చేపట్టిన అర్ధనగ్న ప్రదర్శనలో ఆయన పాల్గొని ప్రభుత్వ వైఖరిని దుయ్యబట్టారు. సిటు జిల్లా కార్యదర్శి రామ్మూర్తి నాయుడు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలి: సమానపనికి సమానవేతనం, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న మున్సిపల్ కాం ట్రాక్టు కార్మికులకు జనసేన రా ష్ట్ర కార్యక్రమాల నిర్వహణా కార్యదర్శి పాలూరు బాబు మద్దతు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు గల కార్మికుల ధర్నా శిబిరాన్ని ఆయన తమ పార్టీ నాయకులతో సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు పి.శంకరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సమ్మెలో యూనియన్ నాయకులతో పాటు జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రాజాం: అర్ధనగ్న ప్రదర్శనలో మున్సిపల్ కార్మికులు



బొబ్బిలి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

భువనేశ్వరిని కలిసిన టీడీపీ నేతలు



భువనేశ్వరితో టీడీపీ నాయకులు

విజయనగరం రూరల్, జనవరి 4: 'నిజం గెలించింది' కార్యక్రమంలో భాగంగా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పర్యటనకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరినిస్థానిక నాయకులు కలిశారు. రాజాంలోని జీఎంఆర్ వసతి గృహంలో గురువారం ఉదయం మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు, మాజీ ఎమ్మెల్సీ గుమ్మడి సంధ్యారాణి, విజయనగరం, అరకు జిల్లాల టీడీపీ అధ్యక్షులు కిమిడి నాగార్జున, కిడారి శ్రావణ్, విజయనగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు, పాలకొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు.

జగన్ ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున



నాగార్జున

విజయనగరం రూరల్, జనవరి 4: సీఎం జగన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు ప్రారంభమైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలను ఒక నియోజకవర్గం నుంచి మరొక ని యోజకవర్గానికి మార్చడం వల్ల కలిగే ప్రయోజనం ఏమీ లేద న్నారు. ఎంపీ, ఎమ్మెల్యేల సీట్లు కాదని... జగన్‌రెడ్డినే మార్చా లన్న నిర్ణయానికి ప్రజలు వచ్చారన్నారు. ఇటీవల కాలంలో ఎ మ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఆ పార్టీని వీడుతున్నారంటే.. 2024 ఎన్నికల్లో వైసీపీ ఓటమి తప్పదన్న అభిప్రాయంతో ఉన్నారన్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో జగన్ ప్ర భుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంభించిందన్నారు. పిల్లల భవిష్యత్తు నాశన మైందన్నారు. ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపాలంటే కేవలం విజనరీ లీడర్ చంద్రబాబుకే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలో 3 దుకాణాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన వెయ్యి క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు గురువారం సీజ్ చేశారు. విజిలెన్స్ అధికారులకు అందిన సమాచారంమేరకు దాడులు జరిపి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ సింహాచలం, ఆర్ఐ భానుప్రసాద్, వీఆర్వో భాను, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

రేగిడి: మండలంలో కాగితాపల్లికి చెందిన వ్యక్తినుంచి బుధవారం రాత్రి 140 మద్యం సీసాలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. కాగితాపల్లి గ్రామ శివార్లలో ద్విచక్రవాహనంపై ఈ మద్యం సీసాలను తీసుకువస్తుండగా స్థానిక పోలీసులకు పట్టుబడ్డాడని, నిందుతుడుని అరెస్టుచేసి రాజాం కోర్టు రిమాండ్‌కు తరలించినట్ల ఎస్ఐ తెలిపారు.

సీతానగరం: మండలంలో లక్ష్మీపురం గ్రామంలో మద్యం సీసాలు అక్రమంగా అమ్ముతున్నారనే సమాచారంతో నిల్వఉన్న 270 మద్యం సీసాలను అమ్ముతున్న వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకుని ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేశారు.

నాటు సారాతో మహిళ అరెస్టు

వంగర: అరసాడలో అక్రమంగా నాటు సారా నిల్వ చేసి విక్రయిస్తున్న బొత్స మంజులను అరెస్టు చేసినట్లు రాజాం ఎస్ఈబీ సీఐ శ్రీధర్ తెలిపారు. సీఐ తన సిబ్బందితో గురువారం రాత్రి దాడి చేసి పట్టుకున్నారు. ఆమె నుంచి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్టు చేసి రాజాం తరలించారు. ఈ దాడిలో ఎస్ఐ శ్రీనువాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● **కొమరాడ:** సారా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు జంఝావతి జలాశయం సమీపంలో గురువారం చేపట్టిన తనిఖీల్లో 100 లీటర్ల సారాతో పాటు ఒడిశాకు చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నీలకంఠేశం తెలిపారు.

కడుబండికి టిక్కెట్ ఇవ్వొద్దు

● వైవీ సుబ్బారెడ్డికి కొత్తవలస, వేపాడ నాయకుల ఫిర్యాదు

కొత్తవలస, జనవరి 4: శృంగవరపుకోట వైసీపీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుపై రోజురోజుకూ అసమ్మతి పెరుగుతోంది. మరోసారి కడుబండికి టిక్కెట్ ఇస్తే సహకరించేది లేదంటూ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డికి గురువారం కొత్తవలస, వేపాడ మండలాల ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఫిర్యాదు చేశారు. వీరంతా గురువారం విశాఖపట్టణం ఎయిర్ పోర్టులో వైవీ సుబ్బారెడ్డికి తమ అభిప్రాయాన్ని తెలిపారు. కడుబండికి తప్ప మరెవరికి టిక్కెట్ ఇచ్చినా కలసి పనిచేస్తామని.. ఆయనకైతే సహకరించేది లేదని ఖరాఖండిగా చెప్పారు. దీనిపై వైవీ స్పందిస్తూ 'శనివారం అన్ని విషయాలు మాట్లాడుకుందాం... ఆ రోజు రండి' అని చెప్పారు. ఒకవేళ శనివారం కుదరకపోతే సోమవారం కచ్చితంగా కలసి మాట్లాడుకుందామని చెప్పారు. వైవీ సుబ్బారెడ్డిని కలసిన వారిలో కొత్తవలస వైస్ ఎంపీపీ మేళాస్త్రి సరస్వతి, మండల శాఖ మాజీ అధ్యక్షుడు మేళాస్త్రి అప్పారావు తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదు

రేగిడి, జనవరి 4: మండలంలోని రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదని తహశీల్దార్ సుదర్శనరావు హెచ్చరించారు. 25 రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఈ ఏడాది 19,600 మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యం కాగా.. గురువారం నాటికి 14 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు తహశీల్దార్ సుదర్శనరావు, ఏఓ మురళీకృష్ణ తెలిపారు. సోమరాజుపేట, పారంపేట రైస్‌మిల్లుల్లో ధాన్యం కొనుగోలు తీరును ఏవోతో కలసి తహశీల్దార్ తనిఖీ చేశారు. ఇప్పటికి 3,500 మంది నుంచి ధాన్యం కొనుగోలు చేయగా... మండలంలోని మిల్లులకు బీజేల కొరత కారణంగా ఇతర ప్రాంతాల మిల్లులకు పంపించాల్సి వచ్చిందని తెలిపారు. అయినా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. తూకం, తేమ శాతంలో తేడాలు చూపించకుండా మద్దతు ఉండేలా మిల్లర్లు వ్యవహరించాలని ఆదేశించారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదని మిల్లర్లను హెచ్చరించారు.

'రీసర్వే అస్తవ్యస్తం'

రామభద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించిన భూముల రీసర్వే అస్తవ్యస్తంగా మారిందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షుడు ముల్లు రాంబాబులు ఆరోపించారు. భూసాయవలస గ్రామంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ సర్వే సిబ్బంది క్షేత్ర స్థాయిలో విచారణ జరపకుండా... భూముల వద్దకు రైతులను పిలవకుండా చేయడంతో తప్పుల తడకలుగా మారిందని ఆరోపించారు. ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు తక్కువగా చూపించడం... తక్కువ ఉన్న వారికి ఎక్కువగా చూపించిన సంఘటనలు కోకొల్లలని అన్నారు. భూమి లేని వారికి కూడా భూములు ఉన్నట్టు చూపించడం న్యాయమా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి రీసర్వే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

'జయహో బీసీ'లో రాజాం నాయకులు



కొల్లును సత్కరిస్తున్న స్థానిక నాయకులు

రాజాం, జనవరి 4: మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో రాజాం బీసీ నాయకులు పాల్గొన్నారు. విశ్వబ్రాహ్మణ బీసీ సాధికారిక కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముగడ శ్రీనివాసరావు, విజయనగరం జిల్లా పార్లమెంటరీ బీసీ అధికార ప్రతినిధి మరిపి జగన్మోహన్‌రావు హాజరయ్యారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి

విజయనగరం (ఆంధ్రజ్యోతి), జనవరి 4: నగరంలోని మెసానిక్ టెంపుల్‌లో గురువారం బ్రెయిలీ జయంతిని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ● **నెల్లిమర్ల:** స్థానిక భవిత కేంద్రంలో గురువారం లూయి బ్రెయిలీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. బ్రెయిలీ చిత్ర పటానికి ఎంఈవో-1 సూర్యనారాయణమూర్తి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. భవిత కేంద్రం ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో గురువారం లూయి బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఈఆర్‌పీ వీర్రాజు.. దివ్యాంగులైన విద్యార్థులతో కేక్ కట్ చేసి, బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు ఆధ్వర్యంలో అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం దత్తి సత్యనారాయణ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించి మాట్లాడారు. అంధులు చదువుకొని అన్నిరంగాల్లో రాణించడానికి కారణం బ్రెయిలీ కనుగొన్న లిపేనన్నారు. ఉపాధ్యాయులు రమేష్, రామారావు, నారమ్మ, కళ్యాణి, సంధ్యారాణి, సత్యనారాయణ, దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

కక్ష ధోరణి తగదు

- సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం
- 24వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వానికి కక్ష ధోరణి తగదని యూనియన్ నాయకులు అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె గురువారంతో 24వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీలు శుక్రవారం నుంచి విధులకు హాజరు కాకపోతే ప్రత్యామ్నయ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 6వ తేదీ నుంచి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆ ఆదేశాల ప్రతులను దహనం చేశారు. (ఆంధ్రజ్యోతి బృందం)


పాచిపెంట: మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి


ఎస్‌కోట: ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు


రాజాం రూరల్: అంగన్‌వాడీల సమ్మెలో మాట్లాడుతున్న సురేష్


రామభద్రపురం: జీవో కాపీలను తగలబెడుతున్న దృశ్యం


బాడంగి: సమ్మెలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు


కొత్తవలస: మెడకు ఉరేసుకుని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

చంద్రబాబును కలిసిన టీడీపీ నాయకురాలు లావణ్య

కురుపాం: కురుపాంకు చెందిన టీడీపీ నాయకురాలు పువ్వల లావణ్య పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబును మంగళగిరిలో జరిగిన సమావేశంలో గురువారం కలిశారు. తాను కురుపాం నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి టికెట్ ఇప్పించాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తన బయోడేటా అందజేశానని, కురుపాం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని వివరించానని చెప్పారు. చంద్రబాబు సానుకూలంగా స్పందించారని తెలిపారు.


చంద్రబాబుతో మాట్లాడుతున్న లావణ్య

నీరు ఇవ్వకుంటే.. వంటా వార్పు

- మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

పార్వతీపురం టౌన్: పట్టణ ప్రజలకు తాగునీరు ఇవ్వకుంటే..మున్సిపల్ కార్యా లయం వద్ద వంటా వార్పు చేపడతామని మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు మున్సిపల్ అధికారులను హెచ్చరించారు. పట్టణ ప్రజలకు సక్రమంగా తాగునీటిని సరఫరా చేయా లని మున్సిపల్ మేనేజర్ రూబేనుకు గురువారం కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్ర ప్రజలకు తాగునీరు సక్రమంగా అందే దని, నాలుగున్నరేళ్లుగా బిందెడు నీటి కోసం ఇబ్బందులు పడుతు న్నారన్నారు. దీనికి మేనేజర్ రూబేను సమాధానం ఇవ్వక పోవడంతో తాగునీటి సరఫరాలో ఎలాంటి తేడాలు వచ్చినా మహిళలతో వచ్చి ఇక్కడే వంటా-వార్పు చేస్తామని హెచ్చరించారు. టీడీపీ నాయకులు సీతారాం, జి.రవికుమార్ ఉన్నారు.


తాగునీటి సమస్య వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

ఈ ప్రభుత్వానికి కాలం దగ్గర పడింది

పార్వతీపురం: ఈ ప్రభుత్వానికి కాలం దగ్గర పడిందని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. గురువారం మున్సిపల్ పారిశుధ్య ఇంజనీరింగ్ విభాగం కార్మికుల సమ్మెనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. న్యాయమైన డిమాం డ్లు నెరవేర్చాలని సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం విచార కరమన్నారు. గత ఎన్నికల ముందు సీఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ, సీఐటీయూ నాయకులు ఉన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన ఉండాలి

- పీవో కల్పనాకుమారి

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటే సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి పై వైద్య సిబ్బంది అందరికీ అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి అన్నారు. గురువారం ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలతో అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈసందర్భంగా ఆమె, వ్యాధి ఉన్నవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవ గాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి, అనూ రాధ, వైద్యాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

పాలకొండ: ఓటరు నమోదుపై మరింత అవగాహన కల్పించాలని సీతంపేట ఐటీడీఏ పీవో కల్పనాకుమారి అన్నారు. గురువారం పాలకొండలో నిర్వహించిన స్వీప్ ర్యాలీలో విభిన్న ప్రతిభావంతులతో కలిస పీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంకా ఓటు నమోదు చేసుకోనివారు ఎవరైనా ఉంటే త్వరితగతిన నమోదు చేసుకోవాల న్నారు. తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ● **సీతానగరం:** స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఆర్డీవో హేమలత ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలువురు వృద్ధులను సత్కరించా రు. కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. తహసీల్దార్ ఎన్‌వీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు. ● **గరుగు బిల్లి:** భవిష్యత్‌కు ఓటు హక్కు ఉపయోగపడుతుం దని ఉప తహసీల్దార్ పి.సత్యలక్ష్మీకుమార్ అన్నారు. మండల కేంద్రంలో 'నీ ఓటు - నీ భవిష్యత్' అనే నినాదాలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవ త్సరాలు నిండి నవారు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటుకు ఉన్న ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ కార్యక్ర మంలో సర్వేయర్ బి.శ్రీనివాసరావు, ఆర్ఐ మండంగి కృష్ణ, సాయి కుమార్, వీఆర్వో నాగరాజు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు. ● **సాలూరు రూరల్:** తాము ఎవరి ఓటు వేశామో తక్షణమే వీవీ ప్యాట్‌ను గమనించడం ద్వారా నిర్ధారించుకోవచ్చునని పార్వ తీపురం ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్ తెలిపారు. సాలూ రులోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఓటు అనంతరం వీవీ ప్యాట్‌లో చూస్తే ఏ గుర్తుకు ఓటు వేశామో కనిపిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి, ఓటరు అవగాహన ర్యాలీ చేశారు. ఇద్దరు దివ్యాంగు లకు, మామిడిపల్లికి చెందిన ట్రాన్స్ జెండర్, నలుగురు సీనియర్ సిటి జన్స్‌ను సన్మానించారు. తహసీల్దార్ బాలమురళీకృష్ణ, ఎన్నికల డీటీ రాజశేఖర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్త హల్‌చల్

పార్వతీపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పాలకొండ - భామిని మార్గంలో ఓ వైసీపీ కార్యకర్త హల్‌చల్ చేశాడు. 'నిజం గెలవాలి' పాదయాత్రలో భాగంగా గురువారం మధ్యాహ్నం భామిని మండలం బయల్దేరిన టీడీపీ శ్రేణులు మార్గమధ్యంలో సతివాడ గ్రామ సమీపంలో భోజనాలు చేశారు. అక్కడ కొద్దిసేపు నారా భువనేశ్వరి కాన్వాయ్‌ను ఆపారు. అయితే మరి కొద్దిసేపట్లో భామినికి భువనేశ్వరి కాన్వాయ్ బయల్దేరుతుండగా.. సతివాడ గ్రామానికి చెందిన ఓ వైసీపీ కార్యకర్త ఒక చేతిలో వైసీపీ జెండా, మరో చేతిలో కర్ర పట్టుకుని హల్‌చల్ చేశాడు. ఇది గమనించిన టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ తన వాహనం నుంచి దిగి ఆ వ్యక్తి వద్దకు వెళ్లి 'నారా భువనేశ్వరి కాన్వాయ్ వస్తుంది పక్కకు వెళ్లాలి' అని చెప్పారు. అయినా ఆ వ్యక్తి వినిపించుకో లేదు. ఈ విషయం తెలుసుకున్న కొంతమంది గ్రామస్థులు అక్కడకు వచ్చి వెంటనే వైసీపీ కార్యకర్తను పక్కకు పంపించేశారు.

భువనేశ్వరిని ఆశీర్వదించిన కాళిదాసుశర్మ

పార్వతీపురం (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా రాజాంలోని జీఎంఆర్ గెస్ట్‌హౌస్ లో పార్వతీపురానికి చెందిన సర్వమంగళ దేవిపేట వ్యవస్థాప కుడు మురపాక కాళి దాసుశర్మ నారా భువనేశ్వరిని ఆశీర్వదించారు. చంద్రబాబు అరెస్టు అనంతరం సర్వమంగళదేవి పీఠంలో చేపట్టిన పూజల వివరాలు, భవిష్యత్‌లో చేపట్టనున్న కార్యక్రమాలను ఆయన వివరించారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కళా వెంకటరావు తదితరులు ఉన్నారు.



సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభలు

గరుగుబిల్లి: సమస్యల పరిష్కారానికి గ్రామసభలు దోహదపడ తాయని సచివాలయ కార్యదర్శి తిరుపతి భాస్కరరావు అన్నారు. గురువారం గొట్టివలసలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల పరిధిలో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన తీర్మానాలు చేసి పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.చంద్రినాయుడు, ఉపాధి క్షేత్ర సహాయకులు నల్ల సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది ఆర్.కాంతి, జి.జనార్దన్ నాయుడు, బి.వరలక్ష్మి, జి.పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు 'కూనంబందవలస' ఎంపిక

సాలూరు రూరల్: మండల స్థాయి క్రికెట్ పోటీలకు కూనంబందవలస జట్టు ఎంపికయ్యింది. పాచిపెంటలో గురువారం నిర్వహించిన ఈ పోటీల్లో పాచిపెంట జట్టుపై కూనంబందవలస జట్టు విజయం సాధించింది.

అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలి

గరుగుబిల్లి: గ్రామాల్లో అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయాలని అరకు టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్య నారాయణ డిమాండ్ చేశారు. గురువారం చిలకాంలో మాట్లా డుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బీసీ వర్గాలకు రాయితీపై అనేక పథకాలు వర్తించేవన్నారు. ప్రస్తుతం ఆ పథకాలను తుంగలో తొక్కిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్రంలో పరిపాలన అంతా ఒకే కులం చేస్తోందన్నారు. నిధుల సమస్యతో 1న అందాల్సిన పింఛన్లు వాయిదా వేయడం సిగ్గు చేటన్నారు. కొన్ని గ్రామాల్లో పార్టీలను అనుసరించి జాబితాలు చేయడం విచారకరమ న్నారు. అర్హత ఉన్న వారికి పింఛను మంజూరు చేయకుంటే తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు తప్పవన్నారు. అరకు రైతు విభాగం కార్యదర్శి కండేన బలరాంనాయుడు, యువజన విభాగం ప్రతినిధి అక్కేన నారాయణరావు, దత్తి స్వామినాయుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సత్యనారాయణ


డివైడర్‌ను ఢీకొట్టిన ఇసుక లారీ

సీతంపేట: కొత్తూరు నుంచి విజయనగరం వైపు వెళుతున్న ఇసుక లారీ ఐటీడీఏ సమీపంలోని సోమగండి జంక్షన్ వద్ద బుధవారం రాత్రి డివైడర్‌ను ఢీకొట్టింది. రోడ్డు మధ్యలో లారీ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాను నిద్రమత్తులోకి జారుకోవడం... పొగమంచు అధికంగా ఉండడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని లారీ డ్రైవర్ పేర్కొన్నాడు.



గోదాదేవికి విశేష దీప సేవ

సాలూరు రూరల్: పట్టణంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, పెదకోమటి పేట రామాలయంలో గోదాదేవికి విశేష దీపాలంకరణ సేవ గురువారం నిర్వహించారు. గోదాదేవికి ఉదయం ప్రత్యేక పూజలు, రాత్రి దీపాలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



జిల్లా పర్యాటకాభివృద్ధికి నిధుల మంజూరు

ఒడిశా

రాయగడ: పారిశ్రామిక, వర్తక, వాణిజ్య రంగాల్లో ప్రగతి పథంలో పయనిస్తున్న రాయగడ జిల్లాలో ఉన్న పలు సుందర ప్రదేశాలను పర్యాట కంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3.44 కోట్లు నిధులు మంజూరు చేసిందని జిల్లా పర్యాటక అభివృద్ధి శాఖాధికారి భగవాన్ ఖోరో తెలిపారు. ఈమేరకు పాత్రికేయులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. జిల్లాలో అనేక సుందర ప్రదేశాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన మూడు కోట్ల 44 లక్షల రూపాయలతో చాటికోన జలపాతం, ట్రైబల్ సంత, దేవగిరి శైవపీఠం, కూలి వాటర్‌ఫాల్, వ్యూపాయింట్ తదితర ప్రదేశాలను అభివృద్ధి చేయనున్నామని తెలిపారు.

నేడు రాయగడ బంద్

రాయగడ: ఆదివాసీలపై జరుగుతున్న అన్యాయాలకు, హత్యలకు నిరసనగా ఆదివాసీ మహాసంఘం ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం రాయగడ జిల్లాలో బంద్ పాటిస్తున్నారు. 2015 డిసెంబరు 15న జరిగిన మజ్జిగౌరి మందిర ట్రస్టు సభ్యుడు భగీరథి మండంగి హత్య మొదలుకుని రెండు వారాల కిందట చంద్రపూర్ సమితిలో లక్ష్మీమారిఖి హత్య వరకు, దోషులను పట్టుకోవడంలో పోలీసులు వైఫల్యం చెందారని ఆదివాసీ మహాసంఘం అధ్యక్షుడు అప్పలస్వామి కద్రక ఆరోపించారు.